# ఉదబిందువులు

★

**శ్రీ జి. వి. కృష్ణరావు**

"అమ్మా, అమ్మా !"

కొడుకు పిలుపులోని ఉద్వేగాన్ని పసికట్టిన సుభద్రమ్మ చెరుగుతున్న వడ్లచేట క్రిందబెట్టి అతనివైపు చూచింది.

"కృష్ణా రామా అంటూ మూల కూర్చోక ఇదేమిటే? ఓపిక ఉన్నది ఒళ్లు దాచుకొంటే బండెడు చాకిరి నెత్తిమీద వేసుకొన్నావా ?" రామయ్య ధోరణి మార్చాడు.

"ముసలిదానిమీద ఎన్నాళ్లనుంచిరా ఈ మమకారం ? నిండుచూలాలు ఈపని చెయ్యలేదు కాని అసలు సంగతేమిటో చెప్పు !" సుభద్రమ్మ నవ్వింది.

తన హృదయాన్ని యిట్టే పసికట్టినందుకు అతని చిరాకు మరీ ఎక్కువయింది.

"నీ ముద్దుల కొడుకు ఏమి చేశాడో చూశావా ?"

"నా చిట్టి తమ్ముడు ఏమిచేశాడో చూచావా అనరాదూ ? అనవు. ఎందుకంటా ? ఇంతకూ అసలు సంగతేమిటో !" తల్లి నిట్టూర్చింది.

కన్నంలో దొంగకు తేలు కుట్టింది. అవును, తల్లివల్ల జరిగిన పొరపాటేముంది ?

"మా తమ్మయ్య ఉత్తరం వ్రాశాడు. నేను ముందుగా వ్రాస్తేనే వ్రాశాడనుకో !"

"నువ్వేమి వ్రాశావు ? అతగాడే మన్నాడు ?"

"ఏమున్నది వ్రాయటానికి ? ఈయేడు ఊచ తెగులు తగిలి పంటలు పోయాయి. ఎకరానికి అయిదారు బస్తాల రాలుబడి కూడ లేదని వ్రాశాను." రామయ్య గొంతు జీరపోయింది.

"అవును, ఈయేటి రాలుబడి అంతేగా ! నువ్వు చేలను పండవద్దన్నావా యేమిటి ?" తల్లి వాత్సల్యం అతన్ని కప్పింది.

"ఊళ్లో మగతాదారులు ఏమిచేస్తున్నారని మా చిట్టి తమ్మయ్య అడుగుతున్నాడు. అవును, ఇంతకాలంనుంచి వాడి చేలో నేను చేస్తున్న దేమిటి, మగతా కాక !"

"ఉద్యోగంలో చేరింతరువాత చిన్నవాడికి బొత్తిగా మతి పోయింది."

"వాడికేమీ మతి పోలా. పోయిందల్లా మనకే !"

"అయితే నేను వచ్చిపొమ్మంటున్నానని కార్డుముక్క రాసి పడెయ్యి."

"రాయవలసిన అవసరం నాకేమీ లేదు. వాడి లెక్క ప్రకారం రావలసిన పైకం అణా పైసలతో సహా ఇవాళే మనియార్డరు చేస్తున్నా." రామయ్య వెళ్లిపోయాడు.

సుభద్రమ్మ విస్తుపోయింది. తన ఇద్దరి కొడుకుల సంగతి ఆమెకు పూర్తిగా తెలుసు. వాళ్లకు తండ్రి అయినా తల్లి అయినా తనే. తన చేతులమీదుగా పెంచి పెద్దవాళ్లను చేసింది. ఇద్దరూ కవలలు. ఒకటే పోలిక. ఒకే తల్లి పాలు త్రావి ఒకే సంస్కారంలో పెరిగారు. అయినా గుణాలలో ఇరువురికీ ఎంతో తేడా. పెద్దవాడి మనసు ఉదారం. చిన్న వాడు కూడా మంచివాడే కాని, కాస్త లోభగుణం ఉన్నదేమో ననిపిస్తుంది. అయినా సుభద్రమ్మ కనుగలిగి దిద్దటానికి ప్రయత్నించింది. ఉన్న కొంద్ర తక్కువ. ఇద్దరి పిల్లలకూ ఇంగ్లీషు చెప్పించే తాహతు లేదు. కనుక చిన్నవాడైన లక్ష్మయ్యను ఇంగ్లీషు చదువులకు పంపి ఆమె రామయ్యను వీథిబడి చదువుతో మానిపించి తనకు తోడుగా నిలుపుకొన్నది.

రామయ్యకు ఏకోశానా కుళ్లుబోతుతనం లేదు. నమ్మిక చిక్కితే అతడు ఒడలు కోసి యిస్తాడు. మనసు విరిగిందో అతనిని ఎవరూ వినిపించలేరు. అతని స్నేహం వంటిదే పగ కూడ. అవి అతి ఉత్కటాలు. లక్ష్మయ్య లక్ష్మణరావై ఎల్. టి. పూర్తిచేసుకుని బస్తీలో బడిపంతులై ఒక గ్రాడ్యుయేటును పెళ్లి చేసుకొన్నాడు. కొడుకు లిద్దరూ ఒకరి కొకరు అండదండగా ఉండాలన్న ఆశకొలది లక్ష్మయ్య చదువు ఖర్చులు పాటికి రానీక తనవంతు రెండెకరాలు పోను మిగతా ఆస్తిని ఇద్దరికి చెరిసగం పంచి యిచ్చింది. తమ్ముడూ, తల్లీ కావాలనుకొన్న రామయ్య నణగలేదు. అంతేకాదు, తమ్ముని పొలం తానే చేస్తూ, రాలిన పంటను అమ్మి ముద్ర శుద్ధిగా ఈనాటివరకూ అప్పగిస్తూ వచ్చాడు.

తలాంటి రామయ్యకు లక్ష్మణరావు అలా ఉత్తరం వ్రాశాడని వినగానే సుభద్రమ్మ మనస్సు చివుక్కుమన్నది. తనకే అలా అనిపించినప్పుడు పెద్దవాని మనస్సు ఎలా ఉండాలి ? చిన్నకొడుకు దగ్గర ఉంటే గూబ గుయ్యి మని పించేది. కాని, ఏమి లాభం ? ఎక్కడో దూరాన ఉన్నాడు.

అవాళే సుభద్రమ్మ చివాట్లువేస్తూ చిన్నకొడుకుకు ఉత్తరం వ్రాసింది. కాని మళ్లీ ఏమి తోచిందో వ్రాసిన ఉత్తరం చించివేసి జరూరుగా ఒకసారి వచ్చి వెళ్లవలసిందని కార్డు వ్రాసి రామయ్య కొడుకు సూర్యం చేత పోస్టులో వేయించింది.

రామయ్య తల్లిని పలకరిస్తూనే ఉన్నాడు. కాని ఆమెకు ఆ పలుకరింతలో ఏదో లోటు ఉన్నట్లుగానే ఉన్నది. వారంరోజులకు చిన్నకొడుకునకు మారుగా కవరు వచ్చింది. ఆమె విప్పి చదివించింది.

అత్తయ్యకు,

నమస్కారాలు. ఇక్కడంతా క్షేమం. అక్కడ అందరికీ కుశలమే కదా !

మీ ఉత్తరం చేరింది. ఏదో చిరాకులో ఉండి మీ అబ్బాయి బావగారికేదో తెలివితక్కువ సమాధాన మిచ్చారట. ఎంతో నొచ్చుకుంటున్నారు. తనకు మొగం చెల్లక నన్ను సమాధానం వ్రాయమన్నారు. మీరే వ్రాస్తే బాగుంటుందని మొత్తుకున్నాను. వింటేనా ? ఇంకా జాగుచేయటం మర్యాద కాదని వ్రాస్తున్నాను. నా సాహసానికి క్షమించాలి. నేనే వచ్చి బావగారికి కనిపించి క్షమాపణ చెప్పుకొంటే మేలేమోననిపించింది. కాని అన్నదమ్ముల నడుమ నీ జోక్యమేమిటి అంటారేమోనన్న భయంతో మానివేశాను. బావగారికి మీ రెలాగైనా నచ్చజెప్పండి. అదనంగా పంపిన ఆరువందలకు చెక్కు పంపిస్తున్నాను. వారికి అందజేయండి.

అక్కయ్యతో గలిసి ఒకసారి మీరు ఇక్కడకు ఎందుకు రాకూడదు ?

ఇట్లు,
మీ కోడలు,
శ్యామల.

"ఇందుకే చదువుకొన్నవాళ్లకంటె చాకళ్లు మేలంటారు!" సుభద్రమ్మ విసుగుకొన్నది.

ఆ రాత్రి రామయ్య భోజనంచేసి తాపీగా కూర్చుండగా "నీ తమ్ముడు ఉత్తరం రాశాడురా!" అని తల్లి చెప్పింది.

తడు ఊకొట్టి ఊరుకున్నాడు. "పొరపాటు జరిగిందని వాడెంతో బాధపడి ఆరువందలు తిరిగి పంపాడు", అంటూ ఆమె కోడలు పంపిన చెక్కు ఇవ్వబోయింది.

"కుక్క ముట్టిన కూటికోసం ఈ రామయ్య ఎన్నడూ ఆశపడడు", అతడు చివుక్కున లేచి బజారుకు వెళ్లిపోయాడు.

సుభద్రమ్మ నిర్ఘాంతపోయింది. ప్రక్కనే ఉండి అంతా విన్న పెద్దకోడలు "అత్తయ్యా, పెద్దదానవు. నీకు తెలియనిదేముంది ? ఆ మనిషికి కోపంవస్తే అంతేగా ! పోటు పొడుస్తున్నంతమాత్రాన కళ్లు తీసివేసుకోగలమా ?" అన్నది.

"అవునమ్మా, అంతే. మిన్ను కురవకచేలు, కన్ను కురవక బ్రతుకులూ పండవు." సుభద్రమ్మ పైట కొంగుతో ముక్కు తుడుచుకొన్నది.

మబ్బు లురిమాయి. తత్తరపాటుతో రైతులు ఆరకలు కట్టారు. మెట్టచాళ్లు ముగిసాయి. గంగమ్మ వెల్లపొడిచింది.

సాయంకాలం దమ్ము నాగలి ఇంటికి తోలుకుపోతూ పాత పాలేరు ముత్తయ్య చినబాబు చేను దున్నించలేదేమని సుభద్రమ్మను ప్రశ్నించాడు. ఆ రాత్రి ఆమె రామయ్యను కదలించింది.

"ఇకనుంచి నీ పొలంతో నాకు నిమిత్తంలేదని ధాన్యం డబ్బు పంపిననాడే వ్రాశానే !"

'ఇంతకూ చేను దున్ననేలేదు!"

"పోరంబోకులన్నీ దున్ని జరిమానాలు వేయించుకొనే దుర్గతి నాకింకా పట్టలేదు."

"పోరంబోకులా ?" తల్లి కొడుకుల మాటలు వింటున్న మంగమ్మ అందుకొన్నది.

"కాదు, మీ బాబిచ్చిన అరణం !"

"అమ్మాయ్ ! పుణ్యానికి పోతే పాపం వెంటబడుతుంది గాని నీ వూరుకో. వాడి లోకంలో లేడు."

సభద్రమ్మకు అర్థమయింది. పెద్దకొడుకు వ్రాస్తే ఉంటాడు. చిన్నకొడుకు అన్నను నలుగురిచేత అనిపించాలనీ మొగం చెల్లకో, మరచిపోయో చేను సంగతి పట్టించుకోలేదు. చూస్తూ, చూస్తూ బంగారంవంటి చేను పాడుపెట్టటమా ? పిల్లా జెల్లా ఉన్నవాడు. బస్తీలో కాపురం.

తెల్లవారుజామున సుభద్రమ్మ లేచివెళ్లి ముత్తయ్యను లేపి లక్ష్మయ్య చేను చేసుకొమ్మన్నది. తరుణం దాటిన తరువాత తలకెత్తుకొనే సాహసంలేక అతడు తనవల్ల కాదన్నాడు. "అయితే కూలినాగళ్లు పెట్టి దమ్ముచేయించి నాటు వేయించు. ఖర్చులన్నీ నేనే పెట్టుకుంటాను. నీ కష్టం అట్టే

పెట్టుకోను ముత్తయ్యా!'' అన్నది. లోగడ చాలా కాలం తన్నాదుకొన్న ముసలమ్మ నోరు తెరిచి అడుగు తున్నది. అతడు కాదనలేకపోయాడు.

లక్ష్మణరావు చేలో పడ్డ ముక్కలు రామయ్య చెవిలో పకాపకా నవ్వాయి. తాను తల్లిని పువ్వుల్లో పూజిస్తుంటే ఈనాడు ఇలా నలుగురిలో నవ్వులపాలు చేస్తుందా? మాట మాత్రమైనా తనతో అనలేదు. నిజానికి ఆమె బొంది మాత్రం తమతో ఉన్నదే కాని ప్రాణాలన్నీ చిన్నకొడుకు వద్దనే.

ఈ ఆలోచన రాగానే రామయ్య మనసుకు గతమంతా మరొకరీతిగా తోచింది. తల్లి పక్షపాత బుద్ధితోనే తన చదువు మానిపించింది. చిన్నవాడి చదువు ఖర్చులు లెక్కకట్టనీక ఆస్తి పంపిళ్ళ వేయించింది. కళ్ళ ఉండీ తాను అంధుడయ్యాడు.

ఆ రాత్రి సుభద్రమ్మ మనుమణ్ణి ఒళ్ళో కూర్చో బెట్టుకుని, "ఓ జయమ్మ నీ కుమారుడు'' అన్న భాగవత పద్యం చెబుతున్నది. రామయ్య ప్రక్క అరుగుమీద ఒద్దికగా కూర్చుని "అమ్మా!'' అన్నాడు.

"ఏమిటిరా!''

"ఏమీలేదు. ఇంతకాలం పెంచావు. ఒక యింటివాణ్ణి చేశావు. ఇంకా నీమీద ఆధారపడటం బాగుండలేదమ్మా! రేపటినుంచి మా సోలెడు మేము పొంగించుకొంటాము.''

సుభద్రమ్మ కొయ్యబారిపోయింది. ఎలాగో తెమలిచ్చు కొని డగ్గుత్తికతో అడిగింది: "ఇంతకూ నేను చేసిన పాప మేమిటి?''

అతడు మాటాడలేదు.

"గడవవలసిన పురుళ్ళూ, పుణ్యాలూ గడచినా ఈ మొండికట్టె పోక వచ్చింది.''

రామయ్య మారు మాటాడక వెళ్ళిపోయాడు. ఆ మాట లన్నీ వాకిట్లో నిలబడి వింటున్న మంగమ్మ బావురుమన్నది.

"అమ్మాయీ, జరుగవలసిందేదో జరుగుతుంది. నెలలు వచ్చిన మనిషి దిగులుపడరాదు.''

మరునాడు జాము ప్రొద్దెక్కిన తరువాతగాని సుభ ద్రమ్మ లేవలేదు. లేచి ఆమె దొడ్లో కాలు పెట్టగానే తొలి చూరి పడ్డ వెళ్ళావు, దూడ ఒక్కసారిగా అరిచాయి.

"ఏమే అమ్మాయి! దూడను విడవలేదా?'' ఆమె కోడలిని పిలిచి అడిగింది.

"వాటికైనా బుద్ధి ఉండదా అత్తయ్యా!''

"నాయనమ్మా! నాయనమ్మా! ఇందాక పాలచెంబు పత్తుకుని నాన్న దగ్గిరికెలితే పద్దాఆవు ఏవి-చేశాయనుకొన్నా? నువ్వు చూలాలిసింది. బలే చిందులు పెత్తాయిలే! సిని మాలో కూలా అలా చిందులు పెత్తలు.'' సూర్యం అభిన యించాడు.

"నోరుముయ్ వెధవ!'' మళ్లీ పాలచెంబు పట్టుకుని వచ్చిన రామయ్య తన చేతిలోని దాయత్రాటితో కొడుకును ఒకటి వేశాడు.

"పెద్దబ్బాయ్!'' చిరుతపులి కాండ్రుమన్నది.

"ఇది నా సంసారం'', రామయ్య తల్లివంకకైనా చూడక వెళ్లి లేగ కోడెదూడను విప్పి ఆవుకు దాయ వెయ్య బోయాడు. అది బిసతప్పిన రాకెట్టయి ఎగిరిపడ్డది. మరి కొంచెమైతే అతని కన్ను పోవలసింది.

సుభద్రమ్మ గిరుక్కున మళ్లీ ఇంట్లోకి వెళ్లిపోయింది. పోయిన కొంచెంసేపటికే బాదుతున్న చప్పుడు పడ్డ అరు పులు వినిపించాయి. దానిని ఆమె కన్నబిడ్డలాగా పెంచింది. కట్టుతాడు విప్పితే అది వెంటబడి వంటయింటి గుమ్మం దాక వచ్చి నిలబడిపోయేది. ఆ సంగతి జ్ఞప్తికి రాగానే ఆమె నిలుచున్న చోటనే చతికిలబడిపోయింది.

భూమి మాత్రం చతికిలబడలేక తన చుట్టూ నాలుగు సార్లు అలంగం తిరిగింది. ఆ మధ్యాహ్నం కటికినులకల్లో పండుకొని సుభద్రమ్మ ఇంటి వాసాలవంక చూస్తున్నది.

"నాయనమ్మా, నాయనమ్మా!''

"ఎవరది.''

"ఇష్! బిగ్గలగా మాతాలకు. నాన్న బయత అలుగ్గ మీన కూచున్నాలు. ఇంతాలు.''

"అరే, అటు తిరిగిరా!''

"అమ్మో! వత్తే బతకనిత్తాలు! మొన్నే చెప్పాలుగా, పానాలు తోలేత్తా నన్నాలు.''

"అలాగా!''

"సలేగాని, అన్నం తిన్నావా?''

"ఆఁ .... ఆఁ''

"ఒత్తిదే. అబద్ధాలు చెవుతున్నావు. నీకు ఆలపిల్లలు పులతాలు నాయనమ్మా!''

"ఓరి పిచ్చిగాడిద!''

"గాలిద ఓండ్రపెత్తును. నేను పెత్తను.''

ఆమె మాటాడలేదు.

"ఈ యింట్లో అందరికీ కోపాలే. నీకు కోపం, వాన్నకు కోపం, అమ్మకు కోపం, ఆవుకు కోపం, అవుదూడకు కోపం వాకేనా లేంది ! నేనూ కోప్పలతా. "ఒలే పెద్దబ్బాయ్ ! నీకు మతి పోయిందిలా ! లేకపోతే నిచ్చేపంలా పాలు తాగలేక పద్దను అమ్మేత్తావా ?" సూర్యం వాయనమ్మను అనుకరించాడు.

నవ్వుతుందనుకొన్న వాయనమ్మ బొమ్మలాగ చూస్తున్నది. సూర్యానికి ఏమీ అంతుపట్టలేదు. ఏదో తప్పుచేశానన్న భయంతో అతడు చల్లగా జారుకొన్నాడు.

తనను దగ్గరకు చేరనీని పాడి పడ్డను తెగనమ్మి రామయ్య బక్కనీళ్లకు కూడ వాచిపోతున్నాడు. ఆవుకూడ దాయ వేయనీయటంలేదు. కోడెదూడ గదా అదైనా బాగు పడుతుందన్న ఆశతో వదలి ఊరుకుంటూ వచ్చాడు. ఆవు తిరిగలదనీ, ఒకప్రక్క అయినా తీయకపోతే లేగదూడ అరమా యించుకోలేదనీ అతడు గుర్తించలేదు. పొలముమీది చాకిరి అయితే చేస్తూ వచ్చాడే కాని పాడి పశువులకు అత డెప్పుడు పరామరిక చేశాడు ? పదిరోజులలోనే అజీర్తిరోగంతో కోడె దూడ చచ్చిపోయింది. వలవల ఏడుస్తూ సూర్యం ఆ సంగతి తడిక కంతలలోనుంచి సుభద్రమ్మకు చెప్పాడు. నిప్పుల కవ్వంతో ఆమెకు గుండెలు చిలికినట్లయింది. వచ్చిపడుతున్న కడగండ్లన్నిటికీ తల్లే కారణమని కొడుకు మరీ గండరించాడు.

లేగదూడ చనిపోగానే సుభద్రమ్మ మనసు పరిపరి విధాల పోయింది. తన ఉనికివల్ల కొడుకు కోపం పెరుగు తుందే కాని తరగదు. ఆ కోపంతో ఇలాగే ఏవో తెలివి తక్కువ పనులు చేస్తాడు. నష్టపోతాడు. తన మనస్సు మరీ వికలమవుతుంది. ఈ చిక్కులన్నీ దేనికి ? కొంతకాలం తా నక్కడ లేకపోతేనో ? వాడి మనస్సు కుదుటపడవచ్చును. లేదా తన కైనా కొంత మనశ్శాంతి కలుగవచ్చును.

ఆ మధ్యాహ్నం కొడుకు వాటాలోకి వెళ్లి మంగమ్మను పిలిచి "అమ్మాయి, ఇల్లు భద్రం ! నీ సంసారం సంగతి నీకు చెప్పనక్కరలేదు. వస్తానమ్మా !" అన్నది. గ్రుడ్ల నీరు గ్రుడ్లలోనే గ్రుక్కుకొంటూ "నన్నేమి చేసిపోతున్నా వత్తయ్యా !" అని మంగమ్మ అన్నది.

"నేను బిడ్డల్ని కన్నానే గాని, గడ్డల్ని కనలేదు." సుభద్రమ్మ ముఖం కొంచెం ఎర్రబడ్డది.

కోడలు మళ్లీ నోరెత్తలేదు.

సూర్యం ఇంటివద్ద లేని సమయం చూసుకొని సుభద్రమ్మ చిన్న మూటతో బయలుదేరి ఎలాగో మరునాటి పద కొండు గంటలకు లక్ష్మయ్య ఇంటికి చేరింది. ఇంట్లో కొడుకు గాని, కోడలుగాని లేరు. పనిమనిషి బండబూతులు తిడుతూ లోపలినుంచి నాలుగేళ్లవాణ్ణి, రెండేళ్లవాణ్ణి తరుము కొచ్చి వరండాలో నిలబడ్డ సుభద్రమ్మను చూచి "బిచ్చానికి ఏలాపాలా లేదా ఏంది ? పోపో" అని కసరుకొన్నది.

సుభద్రమ్మకు తన రేగిన తల, రైలుప్రయాణంతో మాసినబట్ట జ్ఞప్తికివచ్చి నవ్వుకొని, "లక్ష్మయ్య లేడూ ?" అన్నది.

"ఈడ లచ్చమయ్యలు లేరు, గిచ్చమయ్యలు లేరు పోపో. ఈ దొంగేసాలు సాల సూసాము", పనిమనిషి పిల్లలను లోపలికి నెట్టి తలుపు వేసుకొన్నది.

ఆ క్రిందటి ఉదయాన ఎప్పుడు రెండు మెతుకులు ఎంగిలిపడ్డదో ముసలిప్రాణం ఆ వరండాలోనే చదికిలబడ్డది. సాయంకాలం నాలుగున్నరకు స్కూలునుంచి తిరిగి వచ్చిన లక్ష్మణరావు విస్తుపోయి పనిమనిషిని చెడామడా తిట్టి తల్లి స్నానానికి నీళ్లు తోడించాడు. ఆమె స్నానం చేసింది. అంత లోనే శ్యామల ఆఫీసునుంచి వచ్చి జరిగిందంతా విని నొచ్చుకుంటూ, "ముందుగా ఉత్తరముక్క వ్రాస్తే కాక పోయిందా అత్తయ్యా !" అన్నది.

"ఇంతకూ మా వియ్యంకుడికి ఉత్తరం వ్రాయ మంటావు !"

"ఏమని ?" శ్యామల విస్తుపోయింది.

"ముందుగా ఉత్తరముక్క తప్ప అమ్మాయిని ఇంటికి రానీయవద్దని."

"అదిగాదు అత్తయ్యా ! మాట మాత్రం ముందు తెలిస్తే ఇలా జరగకపోనుగదా అని అంటున్నాను."

"రోజుకొక పనిమనిషిని మార్చుకొంటున్నారని నేను మాత్రం కలగన్నానా ?"

"ఏమండోయ్, మిమ్మల్నే ! సమాధానం చెప్పండి. నావంతు అయిపోయింది." కోడలు నవ్వింది.

"బాగుంది వ్యవహారం. అత్తా కోడళ్లు పోట్లాడుకొనే వాళ్లు పోట్లాడుకోండి. మధ్య నన్ను లాగుతారు దేనికి ?"

"ఇంతకూ మే మిద్దరం పోట్లాడుకొంటే చూస్తా నంటావు ?" తల్లి, కొడుకు వంక తేరి చూచింది.

"అమ్మ బాబోయ్, ఇద్దరూ ఏకమయారు ! ఈ రాత్రినుంచి సత్ర భోజనం మఠం నిద్ర తప్పదు కాబోలు !" లక్ష్మణరావు ఉత్తరీయంబుజాన వేసుకొని బయలు దేరాడు.

"అత్తయ్య ఎప్పుడు ఎంగిలిపడ్డదో ! పెందలాడే రండి !" శ్యామల భర్తను హెచ్చరించింది.

రోజులు తరాటు గొడుతున్నాయి. ఒళ్లు సరిగా వంచుకోలేక, చేతివాటుకు వీలుపడక పనిమనిషి మానుకొన్నది. సుభద్రమ్మ విసుగుకోలేదు. అన్ని పనులూ తానే అందు కొంటూ కొడుకు ఇల్లు చక్కద్రోసుకొంటున్నది. పిల్లలు ఏడుపులు పెడబొబ్బలు తగ్గించి పెందలాడే లేవటం, ఎవరి పనులు వారు చక్కబెట్టుకోవటం ప్రారంభించారు. "నానమ్మా! నానమ్మా ! మొగం కడగవూ ?" అంటూ మూడోవాడు లేచి వచ్చేవాడు. "అరే అన్నాయ్, చిట్టాడి ముఖం ఇత్తడి తేపాలరా, అందుకే కడిగి అవతల పెట్టమంటున్నాడు." అని రెండో వాడు వెక్కిరించేవాడు. "నీ మొగమే సత్తెపాల, రాచిప్ప," అని కొక్కిరించి నాయనమ్మ కడుగుతానన్నా వద్దని తన పని తాను చేసుకోవటం మొదలెట్టాడు. అయినా నాయనమ్మ చేసే వంటకాలలో అదనంగా ఉప్పు, కారాలు వేసి సరిక్రొత్త రుచులు కల్పించటానికి యత్నించకపోలేదు. కాని సుభద్రమ్మ పడనీయటంలేదు.

మంగమ్మ అత్తయ్యకు ఉత్తరం వ్రాసింది. తనకు ఆడపిల్ల కలిగిందట. అంతా కులాసాగా ఉన్నారట. సూర్యం నాయనమ్మకోసం మారాము చేస్తున్నాడట. రామయ్య తల్లి వాటాలో అడుగుపెట్టటంలేదు సరిగదా, అందులో దీపం కూడ పెట్టనీయటంలేదట.

"బావగారికి ఎందు కంత పట్టుదల ?" ఉత్తరం చదివిన శ్యామల విస్తుపోయి అడిగింది.

"మనిషికొక బుద్ధి, మనమేమి చెబుతాము ?" సుభద్రమ్మ నిర్వేదంతో నిట్టూర్చింది.

ఒకనాటి సాయంకాలం అంతా హాల్లో కూర్చుండగా లక్ష్మణరావు ఉత్సాహంతో అన్నాడు :

"అమ్మా, ఇవాళ మన ఊరినుంచి ఉత్తరం వచ్చిందే!"

"రామయ్య వ్రాశాడా ?" సుభద్రమ్మ ముఖం విరిసింది.

"కాదు, షావుకారు చంద్రయ్య వ్రాశాడు."

"ఏమని ?" ఆమె గొంతులో మొదటి ఉత్సుకత లేదు.

"మన వాటా, ఇల్లూ, దొడ్డీ అమ్ముతారా అని అడుగుతున్నాడు. పదివేలదాకా పెంచేటట్లున్నాడు."

"ఇవాళ ఇల్లు అమ్ముతానంటావు, రేపు నన్నమ్ముతా నంటావు !"

"అమ్మా ! అమ్మా ! నిజంగా నాయనమ్మను అమ్ముతారంటే" పెద్దకొడుకు రఘు ఉత్సాహంతో అడిగాడు.

"ఆఁ, అమ్ముతారు, కొంటావా ?" శ్యామల అడిగింది.

"ఓ."

"ఏంపెట్టి ?"

"నాన్నను తాకట్టుపెడతాము. నాయనమ్మను కొనుక్కుంటాము".

"ఆ తాకట్టు కొప్పుకునే దరిద్రు డెవడంట ?"

"మా నాన్న బాగా లెక్కలు వేస్తాడే. హైస్కూలు పిల్లలంతా అంటున్నారు. ఏ షావుకారైనా తాకట్టు పెట్టుకోడా యేమిటి ? ఎందుకు నవ్వుతా ?"

"నోరుముయ్, వెధవ ! వసపిట్ట వాగుడూ నువ్వూను. అది కాదమ్మా ! ఆ కొంప అక్కడ ఉండి ఏమిచేస్తున్నది ? దీపం పెట్టేవాళ్లయినా లేరా ? అమ్మితే యేం ? నువ్వు చూస్తూనే ఉన్నావుగా. అద్దె కట్టలేక ఎంత అవస్థ పడుతున్నామో, ఆ డబ్బుతో ఇక్కడ స్థలమైనా కొనుక్కోవచ్చునుగా! ఏమంటావు శ్యామలా ?" అతడు భార్యను హెచ్చరించాడు.

"అమ్మాయ్, మీ ఆస్తిని మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి ! మధ్య కాదనటానికి నాకేమిటి హక్కు ?" సుభద్రమ్మ చటుక్కున లేచి వెళ్లింది.

ఆ రాత్రి శ్యామల భర్తతో తగవు పెట్టుకొన్నది. "మీ సుఖం మీరు చూచుకొంటే సరిపోయిందా ? ఇదివరకే మీ అన్నయ్య ఆమెమీద కారాలు, మిరియాలు నూరుతున్నాడు. ఇప్పుడు ఇల్లు అమ్మటానికి ఒప్పుకొంటే ఏమవుతుంది ? కచ్చెకట్టి మీచేత ఇల్లు అమ్మించిం దనుకోడా ? ఇదివరకు వచ్చిన మాటపట్టింపులతోనే ఆమె కుమిలిపోతుంటే ఇది మరొకటా ? ఈమెను మళ్లీ పెద్దకొడుకు ముఖం చూడవద్దంటారు. మీలాగే వారూ ఆమె కడుపున పుట్టలేదా ?"

"నీకు బొత్తిగా మతిపోయింది. నువ్వనేదేమిటి ? నీ పిల్లల బాగోగులు నీకు పట్టకపోతే నాకా ?" లక్ష్మణరావు వికటంగా నవ్వాడు.

"అందుకే మండుతుంది. అంత దూరపు ఆలోచన కలవాళ్లు అయితే మీ అన్నయ్యతో మాటాడి ఆమెకు చెప్పండి. అయినా తెలియక అడుగుతాను. ముందుగానే అన్నదమ్ము లిద్దరూ ఆమె ఆస్తిని అమ్ముకొంటే ఆమె ఎక్కడ ఉంటుంది ? ఏమి తింటుంది ? ఆమెకు ముసలితనం వచ్చిందనేగా ఈ ఆట ఆడుతున్నది ?"

మరునాడే సుభద్రమ్మ ప్రయాణం కట్టింది. వెళ్ల వద్దని శ్యామల ఎంతగానో బ్రతిమాలింది. పెద్ద మనుమ లిద్దరూ చెరొక రెక్క పట్టుకున్నారు. మూడోవాడు ఆమె మూటను తీసుకుపోయి ఇంట్లో ఎక్కడో దాచాడు.

లక్ష్మణరావు తిరిగి గృహ విక్రయ ప్రస్తావన తేలేదు. మాసాలు గడిచాయి.

"అమ్మా, మనియార్డరు వచ్చింది" అంటూ ఒక నాడు లక్ష్మణరావు డబ్బూ, ఫారమూ పట్టుకొచ్చి తల్లి కివ్వబోయాడు.

"ఎక్కడనుంచి ? ఎవరు పంపారు ?" ఆమె అడిగింది.

"అన్నయ్య. నీ వంట పైకం కాబోలు. కాకపోతే ఎనిమిది వందలు దేనికి పంపుతాడు ? ఇకనుంచి పొలం ఎవరి కైనా ఇచ్చుకొమ్మంటున్నాడు."

"అక్కరలేదు. తిప్పి పంపు" ఆమె తాపీగా అన్నది.

"ఎనిమిది వందలే !"

"ఊళ్లో క్లబ్బు లున్నాయే !" శ్యామల నవ్వింది.

"షటప్ !"

"బళ్లో ఈ చదువులే చెబుతున్నావా ?" సుభద్రమ్మ కొడుకువంక చూచింది.

లక్ష్మణరావు అక్కడనుంచి వెళ్లిపోయాడు. ఆరాత్రి ఇంటికి రాలేదు. మరునాటి ప్రొద్దున్నే సుభద్రమ్మ కోడలిని అడిగింది :

"రాత్రి అబ్బాయి రాలేదుగా !"

"లేదత్తయ్యా !"

"ఎక్కడికి వెళ్లాడో !" సుభద్రమ్మ గొంతులో విషాదం పలికింది.

అంతకుపూర్వమే సమాధానం ఆలోచించుకొన్న శ్యామల చెప్పింది : "ఏదో పని ఉన్నదట. ఒకవారం స్కూలుకు సెలవు పెట్టి వెళ్లారు."

సుభద్రమ్మ మళ్లీ ప్రశ్నించలేదు. నిజానికి ఆ ధైర్యం కూడ లోపించింది. వెనుకటి దుస్థితి తిరిగి తారసిల్లు తున్నదా ? లోగడ చిన్నకొడుకున్నాడని బయలుదేరి వచ్చింది. ఇప్పుడు మరెక్కడకు బయలుదేరుతుంది ? ఆలోచించే సాహసంలేక సుభద్రమ్మ కోడలిమాట నమ్మింది. జీవనలాలస ప్రగాఢం. అతి విచిత్రం. అది జీవేశ్వరులనే కాదు, సర్గా పవర్గాలనే కాదు, ధర్మాధర్మాలనే కాదు, హేతువునే సృష్టి స్తుంది. అవసరమైతే ఆ హేతువును గూడ నాశనం చేస్తుంది.

శ్యామల చెప్పిన వారం రోజులు గడిచాయి. కాని లక్ష్మణరావు ఇంటికి రాలేదు. క్లబ్బులోనే మకాముపెట్టి అక్కడనుంచే స్కూలుకు వెళ్లివస్తూ ఇంటిముఖం చూడ లేదు. ఈ సంగతి తెలుసుకున్న శ్యామల లోలోన ఉడికి పోతున్నది. అత్తకు ఏమని చెబుతుంది ? ఆమెకు నీడ లేకుండా ఎలా చేస్తుంది ?

"నాయనమ్మా, నాయనమ్మా ! నాన్న ఎక్కడకు వెళ్లాడు ? ఎప్పుడు వస్తాడు ?" అని రఘు ఒక సాయం కాలాన అడిగాడు.

"బుద్ధిలేనివాళ్లు ఎక్కడికైనా వెళ్లతారు. ఎన్నా ళ్లయినా ఉంటారు. నీక్కూడ బుద్ధిలేదా ?" శ్యామల కొడుకుమీద విరుచుకుపడ్డది.

"చూచావా, చూచావా ? నేను చేసిన తప్పేమిటి నాయనమ్మా !" రఘు మొగం చిన్నబుచ్చుకొన్నాడు.

"అన్ని తప్పులూ నావే బాబూ !" సుభద్రమ్మ గొంతు జీరపోయింది.

ఆ తెల్లవారుజామున సుభద్రమ్మ కోడలిని లేపి "వస్తా నమ్మా !" అన్నది. శ్యామల తెల్లబోయింది.

"నాకు అంతా తెలుసమ్మా ! నేనుండగా వాడు ఈ ఇంట్లో అడుగు పెట్టడు. అదంతా నా ప్రారబ్ధం. దానికి నీవేమిచేస్తా ? వస్తానమ్మా, వస్తా ! నేను వెళ్లిపోవటం నీకు కష్టమే. కాని, ఏమిచేయను ? కలకలలాడే సంసారం నామూలాన పాడుకావటం నా కిష్టంలేదు. ఆలుమగల్లను ఒకరికొకరు కాకుండ చేయలేను. నేను రాకముందు హాయిగా ఉన్నారు. వచ్చి లేనిపోని కలతలు తెచ్చిపెట్టాను. అవన్నీ మరచిపో. వెనుకటిలాగా సుఖంగా ఉండండి !"

"అక్కడ కాదనుకొని ఇక్కడకు వచ్చావు. ఇక్కడ కాదనుకొని ఎక్కడకు పోయేటట్లు ? వద్దు అత్తయ్యా, వద్దు ! ముసలితనంలో తల్లిని తరిమివేసే అధికారం ఎవ రిచ్చారు ? అయినా తన సంపాదన తెచ్చి ఎవరినీ పోషించటం లేదు. కాస్తో కూస్తో నేనూ తెస్తూనే ఉన్నా. అంత కష్ట మైతే మానుకొంటారు. నేను తెస్తున్న దానితోనే ఎలాగో సర్దుకొందాము. మీరు ఉండాలి అత్తయ్యా ! జంకితే ఎంత దూరమైనా తరిమికొడతారు." శ్యామల అత్త చేతులు పుచ్చు కొన్నది.

"కడుపున పుట్టిన బిడ్డలకంటే నీవే చాల నయం. చాలు, నాకు ఇంతకన్నా ఏమి కావాలి ? కాని, ఒకటి ఆలో చించు. అత్త వచ్చి కొడుకును కోడలికి కాకుండా చేసిందని

లోకం ఆడిపోస్తుంది. లోకం సంగతి ఎలా ఉన్నా అంతరాత్మ పీడిస్తుంది. ఏదైనా బాధపడతాను గాని ఈ బాధ మాత్రం పడలేను. కాటికి కాళ్లు చాచుకొన్న నా సంగతి వదలు. మగని కెడమైన మగనాలు ఎంత చులకన అవుతుందో ఆలోచించు. పైగా పిల్లా జెల్లా. వీళ్లందర్నీ ఈడేర్చాలి. ఈ బాధ్యత గొప్పదమ్మా! మనం మనుషులం కాని, పశువులం కాదు."

శ్యామల నిశ్చల దీపశిఖ అయిపోయింది.

"అమ్మాయ్!"

"ఏమిటి అత్తయ్యా!"

"ఇంతకాలం నుంచి హృదయం చిదిమిపెడుతున్నా సంతృప్తిపడక ఈ ముసలిప్రాణం మరొకటి కోరుతున్న దమ్మా!"

"ఏమిటి అత్తయ్యా!"

"నాకోసం లక్ష్మయ్యతో తగాదా పడనని మాట ఇవ్వు!"

శ్యామల అత్తవంక చూడలేక ముఖం తిప్పుకొన్నది.

"మాట్లాడవేమమ్మా? కోరరాని దానిని కోరేనా?"

"అంతా మీలాంటివారు కాలేరత్తయ్యా!"

"కావద్దు తల్లీ! కావద్దనే నా ఆశీస్సు."

సుభద్రమ్మ వెళ్లిపోయింది. ఇంక క్లబ్బులో అజ్ఞాత వాసం చేయవలసిన అవసరం ఏమాత్రం లేదని శ్యామల ఉత్తరం వ్రాసి రఘుచేత భర్తకు పంపించింది. ఆ సాయంకాలమే అతడు ఇంటికి చేరాడు.

సుభద్రమ్మ తన యింటికిపోయి తా నల్లరిపడటం, పెద్దవాని మనస్సు వికలం చేయటం ఇష్టంలేకపోయింది. ఏగూటిలో పక్షులు ఆ గూటిలో ఉంటున్నవి. వాటి సుఖం తా నెందుకు చెడగొట్టాలి? బ్రతికి ఇంకా ఎవరిని ఉద్ధరిస్తుంది?

ఈ ఆలోచన రాగానే సుభద్రమ్మకు తన జీవితమ్మీద విరక్తి కలిగింది. కాని బలవంతాన ప్రాణాలు తీసుకోలేక చేతి బంగారు మురుగులు అమ్మివేసి ఆ బస్తీలోనే మారుమూల పేటలో బియ్యపు కొట్టు పెట్టుకొని జీవయాత్ర సాగిస్తున్నది.

ఆ సంక్రాంతికి రామయ్యవద్ద నుంచి తల్లిపేర మనియార్డరు వచ్చింది. లక్ష్మణరావు నిర్ఘాంతపోయాడు. తల్లి స్వగ్రామం చేరక ఎక్కడకు పోయినట్లు? అతడు పోయి భార్యకు మనియార్డరు చూపించాడు.

"ఇంకేం, కావలసిందేదో వచ్చిందిగా. పుచ్చుకోండి?"

"ఫోర్జరీ చేయమన్నావా?"

"ఎన్నాళ్లనుంచి ఈ ధర్మబుద్ధి?"

"అన్నయ్యతో వ్యవహారం!"

"అయితే కూడబలుక్కుని పంచుకోండి."

"ఎందు కంత కోపం?"

"నాకు భాగం లేదని?"

అతడు మళ్లీ మాట్లాడలేదు. ఆ సాయంకాలం శ్యామల రఘువద్ద వాపోయింది:

"మీ నాయనమ్మ మన వూళ్లో లేదట రఘూ!"

"మన వూళ్లో లేదా?" రఘు ఆశ్చర్యపోయాడు.

"ఇవాళ అక్కడనుంచి మనియార్డరు వచ్చింది. ఉంటే ఎందుకు వస్తుంది?" ఆమె కంట తడి పెట్టింది.

రఘుకు అర్థమయింది. తల్లి కన్నీరు చూడలేక అన్నాడు:

"నాయనమ్మ ఈ ఊళ్లోనే ఉన్నదమ్మా!"

"ఈ ఊళ్లోనే! నీవు చూచావా?"

"ఉంది. అప్పుడప్పుడు వెళ్లివస్తూనే ఉన్నా."

"ఒకనాడు కాకపోతే ఒకనాడైనా చెప్పావుకావేమిరా? అవునులే, విత్తొకటైతే చెట్టు మరొక టవుతుందా?"

"చెప్పవద్దంటే ఏమి చెయ్యను?" రఘు ఖిన్నుడయ్యాడు.

"అయితే బయలుదేరు." శ్యామల కొడుకును తొందర పెట్టింది.

"నాన్న వింటాడేమో!"

"ఎవరి మోచేతి నీళ్లూ త్రాగటంలేదు కాని పద!"

ఇద్దరూ రిక్షాలో బయలుదేరారు. వారు వెళ్లేటప్పటికి కొట్టువేసి ఉన్నది. రఘు ప్రక్కవారిని కనుక్కొంటే రెండు రోజుల నుంచి కొట్టు మూసివేసి ఉంటున్నదని చెప్పారు. అంతకుముం దెన్నడూ అతడు నాయనమ్మ యింటికి వెళ్లలేదు. ఆమె అడ్రసు కనుక్కొని తల్లీ కొడుకులు వెదకికొంటూ శిథిలావస్థలో ఉన్న ఒక చిన్న పెంకుటింటికి చేరారు. తలుపు ఓర వాకిలిగా వేసిఉన్నది. లోపలి నుంచి మాటలు వినిపిస్తున్నాయి. "కొత్త సరుకు. ఆ బియ్యం మీకు పనికిరావు. మాట పోతుంది. మీ అమ్మతో చెప్పు. నాలుగైదు రోజుల్లో పాతరపడ్డ సరుకు వస్తుంది. అప్పుడు నేనే పంపిస్తాగా!" శ్యామల తలుపు బారలుగా త్రోసుకు వెళ్లింది. లోపల ఎవరూ లేరు. గది చీకటి కోనేరుగా ఉన్నది. మూలుగునుబట్టి తడవుకొంటూపోయి ఆమె మలక

మంచంలో పండుకొన్న అత్త చేయి పట్టుకుని చూచింది. ఒడలు సెగలు, పొగలు చిమ్ముతున్నది.

"ఒరే రఘు, నీవు రిక్షాలో పోయి నేను రమ్మంటున్నానని చెప్పి డాక్టరు రాధమ్మను అర్జెంటుగా వెంట బెట్టుకురా. ఇప్పుడు ఇంట్లో ఉంటుంది. ఇల్లు తెలుసుగా!"

అతడు రాధమ్మ కారులో తిరిగి వచ్చాడు. డ్రైవరు సాయంతో సుభద్రమ్మను కారువెనుక సీటులో పండుకోబెట్టి గదికి తాళంపెట్టి శ్యామల రఘు వెనుకసీటు ముందు కూర్చున్నారు. కారు బయలుదేరింది.

"ఎవరు ఈ ముసలమ్మ ?" రాధ అడిగింది.

"దిక్కులేనిది." శ్యామల గొంతు డగ్గుత్తిక పడ్డది.

"ఈ అనాథసేవ ఎప్పటినుంచి ?" ఆమె నవ్వింది.

"ఏదో దూరపు చుట్టరికం. ఆమెకు కావలసినవాళ్లు ఎక్కడో ఉన్నారు. సుస్తీగా ఉన్నదంటే చూచి నీకోసం కబురంపించాను."

"నర్సింగ్‌హోంకు పోదామా, మీ యింటికా ?"

"నర్సింగ్‌హోంకే పోనీండి !"

"అమ్మా !" రఘు ఏదో చెప్పబోయాడు.

ఆమె మెల్లగా కొడుకును గదిమింది.

శ్యామల ఆఫీసుకు సెలవుపెట్టి అత్త వద్దనే ఉంటున్నది. పిల్లలు అప్పుడప్పుడు వచ్చి చూచిపోతున్నారు. లక్ష్మణరావుకు ముఖం చెల్లక రాలేదు. నాలుగు రోజుల తరువాత సుభద్రమ్మకు తెలివి వచ్చింది.

"ఎవరిల్లు ?"

"ఇల్లుకాదు నాయనమ్మా !! ఆసుపత్రి." దగ్గరఉన్న రఘు అంతా వివరించి చెప్పాడు.

"డాక్టర్లు దేవుళ్లు కాదూ ?" అంటూ కోడలు కనిపించగానే ఆమె బలహీనంగా నవ్వింది.

"అదేమిటత్తయ్యా ?"

"ఎందుకొచ్చిన దండుగ గాని నీ యింటికి చేర్చు. ఈ ముసలితనంలో మందులు పట్టవు."

"అలాగే నత్తయ్యా ! బావగారికి ఉత్తరం వ్రాశాను. బండి తోలుకొస్తారు. రాగానే వెళ్లిపోదాము. ఈ మందు పుచ్చుకోండి !"

"అవునవును. రామయ్య బండి తప్పక తోలుకొస్తాడు!" సుభద్రమ్మ మందు త్రోసివేసింది.

"ఇంతగా కలవరిస్తున్నావే, విన్ను చూ స్టానికి పెద నాన్న ఎందుకు రాడు ?"

"రాడు బాబూ, రాడు. నేను చచ్చిపోయినా రాడు. వాడి సంగతి నీ కిప్పుడప్పుడే అర్థంకాదు."

పెద్దకొడుకు వచ్చి చెబితేనన్నా మందు తీసుకొంటుందేమోనని శ్యామల బావగారికి ఉత్తరం వ్రాసింది. మంగమ్మ, సూర్యం వచ్చారే కాని రామయ్య మొగమైనా చూపించలేదు. సుభద్రమ్మ పోరువడలేక శ్యామల ఆమెను తన యింటికి తీసుకువెళ్లింది.

మళ్లీ జ్వరం ఎక్కువయింది. ఎవ రెన్నివిధాల బ్రతిమాలినా సుభద్రమ్మ మందు త్రావటం మానివేసింది. ఒక నాడు రఘును ఒంటరిగా పిలిచి "బాబూ, ఉత్తరం ఏమిచేశా"వని అడిగింది. "పెదనాన్నను కలుసుకొన్నప్పుడు ఇమ్మంటివిగా. అలాగే ఇస్తాను నాయనమ్మా!" అన్నాడు.

కొలది రోజులకే హంస లేచిపోయింది. ఆమె శరీరంతో లక్ష్మణరావు, శ్యామల, పిల్లలు, మంగమ్మ, సూర్యం స్వగ్రామం చేరారు. అప్పుడు గూడ రామయ్య వెళ్లి తన గొడ్లచావట్లో కూర్చున్నాడే కాని తల్లిని చూడ నైనా రాలేదు. ఎందరు ఎన్ని విధాలుగా అన్నా తల్లి అంత్యక్రియలలో పాల్గొనలేదు.

కర్మ ముగిసిన తరువాత లక్ష్మణరావు అన్న వద్దకు వెళ్లి అయిన ఖర్చులు చెప్పి తల్లి తాలూకు పది సంవత్సరాల పంట నిలవ ఉండాలని లెక్క తేల్చాడు.

"ఆమె పంట దమ్మిడీ ముట్టుకోలేదు. ఎప్పుడు కప్పుడు మనియార్డరు చేస్తూ వచ్చాను. ఆమె తిరగగొడుతుంటే ఆమె సేవింగ్సు అకౌంటులో జమ కట్టించాను." రామయ్య లోపలకు వెళ్లివచ్చి ప్యాస్‌బుక్కు తమ్ముని ముందు పడేసి గొడ్లచావడికి బయలుదేరాడు.

"ఖర్చులు పోగా నీకు సగం వస్తుందన్నయ్యా!" పుస్తకం తెరిచి చూస్తూ లక్ష్మయ్య అన్నాడు.

"నాకేమీ సంబంధంలేదని ఏనాడో చెప్పాను" అతడు వెళ్లిపోయాడు.

రఘు వెదకికొంటూ వచ్చేటప్పటికి రామయ్య గొడ్ల చావట్లో గాటిమీద కూర్చుని మేస్తున్న ఎడ్లజత వైపు దిగాలుగా చూస్తున్నాడు.

"పెదనాన్నా !"

"ఏమిటి ?"

"నాయనమ్మ ఈ ఉత్తరం మీ కిమ్మన్నది."

"అమ్మ చచ్చిపోయింది. అంత్యక్రియలు గూడ జరిగిపోయాయి."

"ఈ ఉత్తరం మీ కిమ్మని చెప్పి చనిపోయింది."

"చచ్చినవాళ్లకు బతికున్నవాళ్లతో పనేమిటో !"

రఘుకు ఆశ్చర్యం, కోపం కలిగాయి. "నీకెలా తెలుస్తుందీ ?" అంటూ ఉత్తరం ఇవ్వబోయాడు.

"నే నెందుకులే, నువ్వే చదువు."

రఘు కవరు చించి ఉత్తరం తీసి మెల్లగా ప్రారంభించాడు :

పెద్దబ్బాయ్ !

తల్లినయి ఉండి చిన్నవాడిమీద పక్షపాతం చూపించాననే కదా నీకు కోపం ? మానవులన్న తరువాత మమతలలో ఎచ్చులొచ్చులుంటాయి. మనకు రెండు చేతులొకటే. కాని ప్రతి పనికీ నీవు ముందు కుడిచేయి చాపుతావు. మరి కొందరు ఎడమచేయి చాపుతారు. దీనికేమంటాము ? అది అలా ఉంచు. చిన్నవాడి చదువు ఖర్చులు లెక్కగట్టక ఆస్తిని సరిసమానంగా పంచాననే కదా నీ బాధ. కలతలు లేక ఇద్దరూ ఒకరికొకరు తోడుగా ఉంటారని ఆశపడి మోసపోయాను. పెద్దగా చదువుకొన్నంత మాత్రాన గుణాలు రావు. చిన్నవాడు నీ మనసు గుర్తించలేదు. జరిగినదేదో జరిగిపోయింది. ఈ పదేళ్ల పంట నీదే. దీనిలో దమ్మిడీ కూడా చిన్నవాడికి రాదు. ఇకనైనా నన్ను క్షమిస్తావు కదూ ?

సుభద్ర.

రఘు ఉత్తరం ముగించి చూచేటప్పటికి పెదతండ్రి చెక్కిళ్లపై సెలయేళ్ళ ప్రవహిస్తున్నాయి. అతడు ఉత్తరం పెదతండ్రి కిచ్చాడు.

"బాబూ, ఈ సంగతి మీ నాన్నకు చెప్పకు." మాట తీసుకొని అతడు ఉత్తరం ముక్కలు ముక్కలుగా చించి వేశాడు.

రఘు దిమ్మరపోయి తేరుకొని నమస్కరించాడు.